క్లుప్తంగా

ఆటోడ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మార్గాని నాగేశ్వరరావు, అడపా శ్రీహరి

రాజమహేంద్రవరం రూరల్: కరోనా కారణంగా అనారోగ్యానికి గురై మృతి చెందిన ఓ ఆటోడ్రైవర్ కుటుంబానికి తోటి కార్మికులు ఆర్థిక సహాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఎన్వీ శ్రీనివాస్, దాసరి ప్రసాద్ చేతుల మీదుగా రూ.25 వేలను బాధిత ఆటో డ్రైవర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్నీస్‌పేట దుర్గాభవాని మదర్ థెరీసా ఆటోస్టాండ్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కొర్ని సూర్య, వైవీవీ కుమార్ మాట్లాడుతూ తమ ఆటో యూనియన్ సభ్యుడు షేక్ బాబీ (నామవరం) కరోనా కారణంగా మృతి చెందాడని చెప్పారు. తమ యూనియన్ తరఫున ఈ ఆర్థిక సహాయం అందజేసినట్టు తెలిపారు.

అన్నసమారాధన

కడియం: దుళ్లలోని భూసమేత వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం భారీ అన్నదానం జరిగింది. దాతలు, భక్తుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాల ప్రజలతో పాటు, కొత్తపేట, ఆలమూరు, మండపేట రూరల్ మండలాలకు చెందిన ప్రజలు తరలివచ్చారు. ఆలయ భక్తబృందం, గ్రామానికి చెందిన యువత, పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ హెడ్ వాటర్‌వర్క్స్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు జరుగుతున్న దృష్ట్యా బుధవారం సాయంత్రం నగరంలో పలు ప్రాంతాలకు రక్షిత తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎస్ఈ పాండురంగారావు తెలిపారు. స్థానిక 11, 12, 13, 14, 15, 16, 20, 21, 22, 23, 24, 25, 26, 27, 28, 29, 30, 31, 32, 34, 35 డివిజన్లలో ప్రభావం ఉంటుందన్నారు. గురువారం ఉదయం యథాతథంగా నీటి సరఫరా జరుగుతుందన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం

కడియం: మండల పాస్టర్స్ ఫెలోషిప్, క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని చైతన్యనగర్ కాలనీలో మంగళవారం జరిగింది. ఫెలోషిప్ వైస్ ప్రెసిడెంట్ ప్రసన్నకుమార్ మందిరంలో జరిగిన ఈ సమావేశంలో ఎం.కరుణాకర్, పరంజ్యోతి వాక్యసందేశమిచ్చారు. సీహెచ్ రత్నదీప్ అధ్యక్షత వహించగా, బిషప్ సాలోమెన్ శుభాలు అందజేశారు. యెషయా ముగింపు ప్రార్థన చేశారు.

నేడు నిరసన

ప్రకాశం నగర్: ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో ఎఫ్ఆర్ఎస్ రద్దు కోరుతూ రాజమహేంద్రవరంలోని ఆర్‌జేడీ కార్యాలయం వద్ద బుధవారం నిరసన చేపడుతున్నట్టు ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు తాటిపాక మధు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న వివిధ రంగాల కార్మికులకు పనిముట్లు సకాలంలో మంజూరు చేయకుండా, వారిపై పని ఒత్తిడి భారం పెంచుతున్నారని విమర్శించారు.

విమర్శించే అర్హత లేదు

ప్రకాశం నగర్: పేపరుమిల్లులో పరంపర పేరు చెప్పి వారసులు కానివారికి లక్షల రూపాయలకు ఉద్యోగాలు అమ్ముకున్న కార్మిక నాయకుడికి.. తమను విమర్శించే అర్హత, స్థాయి లేదని పేపరుమిల్లు ఎనిమిది కార్మిక సంఘాల నాయకులు మండిపడ్డారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు మాట్లాడుతూ కార్మిక నాయకుడు ఒక్కో ఉద్యోగాన్ని రూ.5.5 లక్షల నుంచి రూ.11.5 లక్షలు వరకు అమ్ముకున్నాడని ఆరోపించారు. సమావేశంలో మిల్లు కార్మిక సంఘాల నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, సాకి రమణ, కస్సే రాజేష్ పాల్గొన్నారు.

231 మందికి టీకాలు

కంబాలచెరువు: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో హెపటైటిస్ బి వాక్సిన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. దీనికి డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఆర్టీమందులు వాడుతున్న పేషెంట్లకు వ్యాక్సిన్ ప్రాముఖ్యతను వివరించి అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, టీకా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో భాగంగా 231 మంది ఏఆర్టీ పేషెంట్లకు హెపటైటిస్ బి టీకా వేశారు. కార్యక్రమంలో ఏఆర్టీ సెంటర్ ఇన్‌చార్జ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యూజే కిరణ్, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ వెంకటకృష్ణ, డాక్టర్ శిల పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా..

- పదో తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు
- ఏప్రిల్ 3 నుంచి పబ్లిక్ పరీక్షలు



హుకుంపేట హైస్కూల్లో పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

రాజమహేంద్రవరం రూరల్: పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాశాఖ ప్రణాళికలను సిద్ధం చేసింది. ఏప్రిల్ 3వ తేదీ నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. గతంలో 11 పేపర్లు ఉండగా, ప్రస్తుతం ఈ ఏడాది నుంచి ఏడు పేపర్లు ఉంటాయి. ప్రతి పేపరు కాల వ్యవధి 3.15 గంటలు, వంద మార్కులకు ఉంటుంది. ఈ నేపథ్యంలో పదో తరగతి విద్యార్థులపై విద్యాశాఖ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. దీనిలో భాగంగా ఉదయం 8 గంటల నుంచి 9 వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గతేడాది కరోనా ప్రభావంతో ఫలితాలు అంతంతమాత్రంగా వచ్చాయి. ఈ ఏడాది బడులు ఆలస్యంగా తెరిచినా విద్యాసంవత్సరం సక్రమంగానే సాగింది. ప్రస్తుతం కడియం, రాజమహేంద్రవరం రూరల్, రాజమహేంద్రవరం అర్బన్‌లో 46 జిల్లా పరిషత్ ,మున్సిపల్ హైస్కూళ్లు, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలకు చెందిన 3,821 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. విద్యాశాఖ 60 రోజుల కార్యాచరణను హైస్కూల్లో అమలు చేస్తున్నారు. ఎక్కడా పొరపాట్లు జరగకుండా మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు చేపడుతున్నారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా మంచి మార్కులు సాధించేలా మాక్ టెస్టులు నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

మండలం	ఉన్నత పాఠశాలలు	పదో తరగతి విద్యార్థులు
రాజమహేంద్రవరం అర్బన్	22	1,730
రాజమహేంద్రవరం రూరల్	15	1,285
కడియం	09	806
మొత్తం	46	3,821

గణితంపై భయాన్ని తొలగిస్తున్నాం



గణితంపై ఉన్న అపోహలు, భయాలను తొలగించి, చాలా సులువైన సబ్జెక్టు అనే విధంగా విద్యార్థులను తయారు చేస్తున్నాం. వేగం, కచ్చితత్వం సరి చూసుకుంటూ పరీక్ష రాయాలి. విద్యార్థులు అదనపు తరగతుల ద్వారా బాగా అభ్యసనం చేయాలి. అప్పుడే అనుకున్న సమయానికంటే ముందుగానే పేపరు పూర్తి చేయవచ్చు.

– పదరపాక వెంకటరమణ, గణితం ఉపాధ్యాయులు, హుకుంపేట హైస్కూలు

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



సమ్మేటివ్ పరీక్షలు పూర్తి కావడంతో చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. ఒత్తిడిలో విద్యార్థులు పొరపాట్లు చేస్తారు. పరీక్షల్లో సులువుగా మంచి మార్కులు పొందేలా ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల్లో బోధిస్తున్నాం.

– వీఎస్.జానకిరత్నం, స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్‌సైన్స్), శాటిలైట్‌సిటీ హైస్కూలు

సంక్షేమ సారథి సీఎం జగన్



తొర్రేడులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- తొర్రేడులో గడప గడపకూ మన ప్రభుత్వం

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథి అని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. తొర్రేడు గ్రామ సచివాలయం–1 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పార్టీ శ్రేణులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి 380 కుటుంబాలను చందన నాగేశ్వర్ కలిశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వీధిలైట్లు, రోడ్లు , డ్రైనేజీలు తదితర సమస్యలను స్థానికులు వివరించగా, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి సీతాపతికి సూచించారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో అర్హుల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు చేరుతున్నాయన్నారు. పార్టీ నాయకులు ఉప్పులూరి రాంబాబు (రాము), సొసైటీ చైర్ పర్సన్ చిట్టూరి వెంకటరావు, సభ్యులు దండుమూడి అర్జునరావు, గద్దె సుబ్బారావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కొత్తపల్లి కేశవ రామారావు, మిరియం నెహ్రూ, మెప్పెల్లి రాజు, మంగం శేఖర్ బాబు, చోడదాసి రాహుల్, గద్దె శ్రీనివాస్ చౌదరి పాల్గొన్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- భూహక్కురక్ష పత్రాల పంపిణీ



వేమగిరిలో భూహక్కు రక్ష పత్రాలను పంపిణీ చేస్తున్న కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. మండలంలోని వేమగిరిలో శాశ్వత భూహక్కురక్ష పత్రాలను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రోన్లు తదితర ఆధునిక సాంకేతిక పరికరాలను ఉపయోగించి సమగ్ర రీసర్వేను దేశంలోనే మొట్టమొదటిసారిగా మన రాష్ట్రంలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారన్నారు. దీనిద్వారా భూ యజమానుల హక్కులకు భద్రత కల్పించడం జరుగుతుందన్నారు. కచ్చితత్వంతో జియో రిఫరెన్స్ కోఆర్డినేట్ల ద్వారా భూరక్ష సర్వే రాళ్లను నాటి భూమికి భౌతిక భద్రత కల్పిస్తారని వివరించారు. ఆధునిక పరిజ్ఞానం ద్వారా ఎటువంటి వివాదాలు లేని భూమి రికార్డులను రూపొందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సుజాత, పార్టీ నాయకులు వెలుగుబంటి వెంకటాచలం, బడుగు చిన్ని, కట్టా జమీందారు, పితాని శ్రీను, కాగిత రాజు, చిలుకూరి రామకృష్ణ పాల్గొన్నారు.

గర్భిణులకు సురక్షిత ప్రసవం జరగాలి

కంబాలచెరువు: ప్రమాద స్థితిలో ఉన్న గర్భిణులకు సురక్షిత ప్రసవం చేసే దిశగా అన్ని ఏర్పాట్లు చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఆనం కళాకేంద్రంలో ఆశా దినోత్సవం సందర్భంగా అర్బన్ సెంటర్‌లోని ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, వైద్యాధికారులకు మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్బన్ హెల్త్ సెంటర్లలో ఆరోగ్య సేవలను 100 శాతం పూర్తి చేయాలన్నారు. ప్రమాద స్థితిలో ఉన్న గర్భిణిని ముందుగానే గుర్తించి ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్‌గా చేర్చాలన్నారు. వారికి అవసరమైన అన్ని వైద్య పరీక్షలు చేయించాలన్నారు. ఆశ నోడల్ పర్సన్ అర్జున్ మాట్లాడుతూ కిల్కారి మొబైల్ అకాడమీపై ఆశ కార్యకర్తలకు, ఏఎన్ఎంలకు అవగాహన కల్పించారు. పీసీపీ ఎన్‌డీటీ చట్టంపై ఎంపీహెచ్‌వో డాక్టర్ నాగు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అర్బన్ సెంటర్ డాక్టర్ ప్రసన్న, డాక్టర్ మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా బేతెస్థ మందిర పునాది రాయి



పునాదిరాయి వేస్తున్న రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: కాతేరులోని బేతెస్థవర్షిప్ సెంటర్‌లో మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఎన్‌వీ రావు, మేరీప్రియ దంపతులు ఆధ్వర్యంలో మంగళవారం మందిర పునాది రాయి కార్యక్రమం, తైలాభిషేకం పండగ అత్యంత వైభవంగా జరిగాయి. రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ పునాది రాయి వేశారు. దేవుని సేవకులుగా పి.టాటావిక్టర్, డాక్టర్ కె.మోజెస్‌బాబు పాల్గొని సందేశాన్ని అందించారు.

ప్రతిభా విద్యార్థుల ముందంజ



జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

కంబాలచెరువు: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు ముందంజలో నిలిచారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్ మూర్తి మంగళవారం తెలిపారు. ఎస్.విజయ రాఘవేంద్ర 99.97, జీవీ శ్రీసత్యహేమేష్ 99.32, మహమ్మద్ యూనుస్ 98.86, ఎల్.చంద్రశేఖర్ రెడ్డి 98.76 పర్సంటైల్స్ సాధించారన్నారు. అంతేకాక 16 మంది విద్యార్థులు 97 పర్సంటైల్ సాధించారన్నారు. 50 మంది విద్యార్థులు పైగా అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ శ్రీకాంత్, బాల్ రెడ్డి అభినందించారు.

దేవస్థానం బోర్డు సభ్యుల నియామకం



గుర్రం సూర్యావతి



ఆచంట అనసూయ



కడియాల లక్ష్మణరావు

రాజమహేంద్రవరం రూరల్: దేవదాయశాఖ పర్యవేక్షణలోని ద్వారకాతిరుమల, అన్నవరం దేవస్థాన పాలక మండలిలో సభ్యులుగా రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని ముగ్గురిని నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ద్వారకాతిరుమల ట్రస్టుబోర్డుకు గుర్రం సూర్యావతి (రాజమహేంద్రవరం), గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ఆచంట అనసూయ, అన్నవరం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యులుగా కడియాల లక్ష్మణరావు నియమితులయ్యారు. వీరికి వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ అభినందనలు తెలిపారు.

సంస్థ సేవలు ప్రశంసనీయం



డ్రైనేజీ నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: వేమగిరిలోని సర్వారాయ షుగర్స్ లిమిటెడ్ సంస్థ సేవలు ప్రశంసనీయమని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. వేమగిరిలోని దేవీ జనార్దన్‌నగర్‌లో సర్వారాయ సంస్థ రూ.24 లక్షల సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించినప్పుడు ఈ కాలనీ వాసులు రోడ్డు, డ్రైనేజీ సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ నేపథ్యంలో సర్వారాయ సంస్థ ప్రతినిధులను కోరగా నిధులు కేటాయించారని వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెలుగుబంటి వెంకటాచలం, బడుగు ప్రశాంత కుమార్, సూరపురెడ్డి జానకి రామయ్య, గుబ్బల నాగార్జున, కట్టా జమీందారు, యడ్ల రాజారమేష్, సర్వారాయ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

జననమరణాల నమోదు ఎంతో ముఖ్యం



మాట్లాడుతున్న డీఎస్ఎల్ఏ కార్యదర్శి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: జనన, మరణాలు, వివాహాల నమోదు ధ్రువీకరణ ప్రాముఖ్యతపై స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష్ కుమారి మాట్లాడుతూ జనన, మరణాల నమోదు చట్టం 1969లో వివిధ అంశాలను వివరించారు. జనన ధ్రువీకరణ పత్రం వయసును తెలిపే ప్రధాన రుజువు అని, పాఠశాలల్లో ప్రవేశాలను మొదలుకుని, ఓటరుగా నమోదు కావాలన్నా, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్సు, సంక్షేమ పథకాలు పొందడంలో ఇవి కీలకమన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్లాపస్ చైర్మన్ ఏ.గాయత్రి దేవి మాట్లాడుతూ జనన, వివాహ, మరణాల నమోదు విషయంలో అశ్రద్ధ చేయరాదని, బాధ్యతగా నిర్ణీత సమయంలో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాకినాడ డివిజనల్ పంచాయత్ ఆఫీసర్ వై.అమ్మాజీ, ఎంహెచ్‌వో డాక్టర్ ఏ.వినూత్న, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ డి.సుభాష్ పాల్గొన్నారు.

వ్యక్తిని కాపాడిన పోలీసులు

రాజమహేంద్రవరం రూరల్: డ్రైనేజీలో పడిపోయిన మతిస్థిమితం లేనివ్యక్తిని బొమ్మూరు పోలీసులు స్థానికుల సాయంతో రక్షించారు. సోమవారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఆకతాయిలు పరిగెత్తించడంతో శిబురన్ అనే 40 ఏళ్ల ఎమతిస్థిమితం లేని వ్యక్తి హుకుంపేట రామకృష్ణనగర్‌లోని దుర్గగుడి వెనుక ఉన్న డ్రైనేజీలో పడిపోయాడు. అది చూసిన స్థానికులు 112కి కాల్ చేయడంతో హుటాహుటిన బొమ్మూరు హెడ్ కానిస్టేబుల్ రాంప్రసాద్, కానిస్టేబుల్ శ్రీను అక్కడకు చేరుకున్నారు. అప్పటికే మురుగునీరు తాగేసి లేవలేని స్థితిలో ఉన్న శిబురన్‌ను స్థానికులు సహాయంతో బయటకు తీసి శుభ్రంగా స్నానం చేయించి దుస్తులు మార్చారు. అతడికి ఒంటిపై గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆ కథనం నిరాధారం



విజయకుమార్, ఇన్‌స్పెక్టర్

రాజమహేంద్రవరం రూరల్: బ్లేడ్‌బ్యాచ్ హల్‌చల్ అనే శీర్షికతో న్యూగోదావరి అనే ఉమ్మడి జిల్లా ఈ–ట్యాబ్లాయిడ్ ప్రచురించిన కథనం నిరాధారమని బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ రాయుడు విజయ్‌కుమార్ తెలిపారు. బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆ కథనంలోని బాధిత మహిళ రాత్రి ఒంటరిగా వెళుతుండగా ఆమె మీద బ్లేడ్‌బ్యాచ్ దాడిచేశారని, వారి నుంచి తప్పించుకుని పక్కన ఉన్న అపార్టుమెంట్‌లోకి వెళ్లిందని, అక్కడ అపార్టుమెంటు వాసులపైనా, అక్కడే నివాసముంటున్న కానిస్టేబుల్‌పైనా బ్లేడ్‌బ్యాచ్ దాడిచేశారని కథనంలో రాశారన్నారు. ఈ నేపథ్యంలో బాధితురాలిగా చెప్పిన మహిళను గుర్తించి, విచారణ చేశామన్నారు. ఆమె తన ఇంట్లోనే బ్యూటీపార్లర్ నడుపుతోందని తెలిసిందన్నారు. అలాగే ఆ విధమైన ఎటువంటి సంఘటన జరగలేదని తెలిపిందన్నారు. తప్పుడు వార్తలు రాసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడానికి ప్రయత్నిస్తున్నారని, సదరు మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులను సంప్రదించి నిజాలు నిర్ధారించుకున్న తర్వాతే వార్తలను ప్రచురించాలని మీడియాను కోరారు.